
సాక్షి తూర్పుగోదావరి

శుక్రవారం । 15 । మార్చి । 2024



అన్నదాన భవనానికి రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వెంకన్న క్షేత్రంలో అన్నదాన భవనానికి పెద్దు మిధున్ చక్రవర్తి, ఉషా కిరణ్ దంపతులు (రాజమహేంద్రవరం) గురువారం రూ.లక్ష విరాళం అందించారు.



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్ర (సా॥)	సెహరీ శని (ఉ॥)
రాజమహేంద్రవరం	6.21	4.50
కాకినాడ	6.21	4.50
అమలాపురం	6.21	4.50

న్యూస్‌రీల్

ప్రసాదం స్టాల్ ప్రారంభోత్సవం వాయిదా

అన్నవరం: స్థానిక జాతీయ రహదారిపై డిగ్రీ కళాశాల సమీపాన విశాఖపట్నం – రాజమహేంద్రవరం వైపు ఉన్న దేవస్థానం స్థలంలో నిర్మిస్తున్న సత్యదేవుని నమూనా ఆలయం వద్ద స్వామివారి ప్రసాదం స్టాల్ ప్రారంభోత్సవం వాయిదా పడింది. దీనిని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ శుక్రవారం ప్రారంభించాల్సి ఉంది. ఆయనకు అదే రోజు ఇతర కార్యక్రమాలు ఉండటంతో ప్రారంభోత్సవం వాయిదా వేశామని దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ గురువారం తెలిపారు.

కేంద్రీయ విద్యాలయలో రేపు ఇంటర్వ్యూలు

కాకినాడ రూరల్: వలసపాకల గ్రామంలోని కాకినాడ కేంద్రీయ విద్యాలయలో వివిధ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు శనివారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. ప్రిన్సిపాల్ బి.శేఖర్ గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. సోషల్ స్టడీస్, కంప్యూటర్స్, సైన్స్, ఇంగ్లిషు, సంస్కృతం, హిందీ, నర్స్, స్పోర్ట్స్ కోచ్, కౌన్సిలర్ తదితర పోస్టుల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 8.30 గంటలకు తమ విద్యాలయ వద్దకు రావాలని సూచించారు. అర్హత, జీతం తదితర వివరాలు విద్యాలయ వెబ్‌సైట్ www.kakinada.kvs.ac.inలో చూడవచ్చని తెలిపారు.

లక్ష్మీ గణపతికి కలాలతో అభిషేకం

బిక్కవోలు: ప్రతి ఏడాది మాదిరిగానే పదో తరగతి పరీక్షలకు ముందు స్థానిక శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో స్వామివారికి కలాలతో గురువారం అభిషేకం నిర్వహించారు. ఈ పెన్నులకు పూజలు చేసి, మండలంలోని పదో తరగతి విద్యార్థులకు అందజేస్తామని ఆలయ కమిటీ చైర్మన్ తమ్మిరెడ్డి నాగ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శంఖవరం: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ(కేజీబీవీ)లో ఆరో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.బాల మణికుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనాథలు, బడి బయటి పిల్లలు, మధ్యలో బడి మానేసిన వారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన బాలికలు మాత్రమే దీనికి అర్హులన్నారు. దరఖాస్తులనే అడ్మిషన్లుగా పరిశీలిస్తామని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్‌లో మెసేజ్ ద్వారా సమాచారం అందిస్తామన్నారు. ఆరో తరగతిలో 40, ఇంటర్ ఎంపీసీలో 40 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు వచ్చే నెల 11వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఏపీఐఐసీ డైరెక్టర్‌గా బసవా అశోక్



కాకినాడ: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ (ఏపీఐఐసీ) డైరెక్టర్‌గా బసవా అశోక్ నియమితులయ్యారు. ఈ మేరకు పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎస్.యువరాజ్ గురువారం ఉత్తర్వులు అందజేశారు. కాకినాడకు చెందిన మాజీ కార్పొరేటర్ బసవా చంద్రమౌళి కుమారుడైన అశోక్ వైఎస్సార్ సీపీ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఆయన కృషికి గాను సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సిఫారసు మేరకు మంత్రి గుడివాడ అమర్నాథ్ సహకారంతో ఈ నియామకాన్ని ప్రకటించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.

ఆరుగురికి కారుణ్య నియామకాలు



కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఆరుగురికి కలెక్టర్ కృతికా శుక్లా గురువారం కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేశారు. ఐదుగురికి జూనియర్ అసిస్టెంట్లుగా, ఒకరికి ఆఫీసు సబార్డినేట్‌గా ఉద్యోగాలు కల్పించారు. కారుణ్య నియామకాలు పొందిన వారికి అభినందనలు తెలిపి, అంకిత భావంతో విధులు నిర్వహించి, కెరీర్ పరంగా మంచి అవకాశాలు అందుకోవాలని సూచించారు.



కొవ్వూరులో జవహర్ నివాసం వద్ద టీడీపీ నాయకుల నిరసన



కొవ్వూరులో కార్యకర్తల ఆగ్రహంతో చించిన టీడీపీ ఫ్లెక్సీలు

జవహర్‌కు చెక్

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రికి ఘోర అవమానం
- కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా ముప్పిడి వెంకటేశ్వరరావు
- గోపాలపురానికి మద్దిపాటి వెంకట్రాజు
- రూరల్‌లో గోరంట్లకు లైన్ క్లియర్
- రెండో జాబితాలో కనిపించని జవహర్ పేరు
- ఆయన రాజకీయ భవితవ్యం ప్రశ్నార్థకం
- భగ్గుమంటున్న అసంతృప్తులు



సీటు గోవిందా..: కేఎస్ జవహర్



కొవ్వూరు: ముప్పిడి వెంకటేశ్వరరావు

గోపాలపురం: మద్దిపాటి వెంకటరాజు



రాజమహేంద్రవరం రూరల్: గోరంట్ల బుచ్చయ్య చౌదరి

సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కేఎస్ జవహర్‌కు ఘోర అవమానం ఎదురైందా? పార్టీ నుంచి పొమ్మనలేక పొగ పెట్టారా? ద్విసభ్య కమిటీలోని ఓ నేత ఒత్తిడికి తలొగ్గి నిర్ణయం తీసుకున్నారా? ఏళ్ల తరబడి పార్టీకి చేసిన సేవను లెక్క చేయకుండా పక్కన పెట్టేశారా? అంటే అవుననే సమాధానం వస్తోంది రాజకీయ విశ్లేషకుల నుంచి. టీడీపీ ప్రకటించిన అభ్యర్థుల రెండో జాబితాలో ఆయనకు చోటు దక్కకపోవడమే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తోంది. కొవ్వూరు నియోజకవర్గం నుంచి టీడీపీ – జనసేన ఉమ్మడి అభ్యర్థిగా గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును ఖరారు చేస్తూ టీడీపీ అధిష్టానం గురువారం అధికారిక ప్రకటన చేసింది. ఈసారి జవహర్‌కు కొవ్వూరు టికెట్టు దక్కనీయకుండా పార్టీలోని ఆయన వైరివర్గాలు బలంగా పని చేశాయి. దీంతో ఒకవేళ ఇక్కడ కాకపోయినా గత ఎన్నికల్లో పోటీ చేసి, ఓడిన ఎన్టీఆర్ జిల్లా తిరువూరులోనైనా టికెట్టు ఇస్తారని జవహర్ వర్గం భావించింది. కానీ, అక్కడ టీడీపీ అభ్యర్థిగా కొటికలపూడి శ్రీనివాసరావును అధిష్టానం ఇప్పటికే ప్రకటించింది. దీంతో గోపాలపురం నియోజకవర్గానికైనా పంపుతారని భావించగా.. మద్దిపాటి వెంకట్రాజు పేరు ఖరారు చేసింది. ఇప్పుడు కొవ్వూరులో కూడా ముప్పిడి పేరు ప్రకటించడం ద్వారా అన్నిచోట్లా జవహర్‌కు చంద్రబాబు మొండిచేయే చూపారు. ఫలితంగా పార్టీ జిల్లా అధ్యక్షుడి హోదాలో మాత్రమే కొనసాగే పరిస్థితి జవహర్‌కు ఏర్పడింది. ఈ పరిణామంతో ఆయన రాజకీయ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

భగ్గుమన్న జవహర్ వర్గీయులు

పార్టీ జిల్లా అధ్యక్షుడు.. అందునా మాజీ మంత్రి అయిన జవహర్‌నే పక్కన పెట్టడం రాజకీయ వర్గాల్లో హట్ టాపిక్‌గా మారింది. జిల్లా స్థాయి నేతనే ఇలా పరాభవిస్తే.. ఇక సామాన్య నేతలకు టీడీపీలో న్యాయం ఎలా జరుగుతుందన్న ప్రశ్న ఆయా వర్గాల్లో ఉత్పన్నమవుతోంది. అధినేత నిర్ణయం జవహర్ వర్గీయులకు మింగుడు పడటం లేదు. తమ నేతకు చేసిన అవమానానికి పార్టీ తగిన ప్రతిఫలం అనుభవించక తప్పదని, రానున్న ఎన్నికల్లో తమ సత్తా చూపుతామని వారు సవాల్ విసురుతున్నారు. ఈ అవమానంపై వారు భగ్గుమన్నారు. కొవ్వూరులో ఏర్పాటు చేసిన టీడీపీ ఫ్లెక్సీలను చించేశారు. అధిష్టానానికి వ్యతిరేకంగా నిరసనకు దిగారు. తాజా పరిణామాల నేపథ్యంలో జవహర్ తన వర్గీయులతో సమాలోచనలు చేస్తున్నారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. జవహర్‌ను బుజ్జగించేందుకు టీడీపీ అధిష్టానం సుజయకృష్ణ రంగారావును పంపింది. పార్టీ ఆదేశాల మేరకు పని చేయాలని సూచిస్తున్నా జవహర్ ససేమిరా అంటున్నారు.

ఆది నుంచీ అంతే

మాజీ మంత్రి జవహర్‌ను టీడీపీ అధిష్టానం, అధినేత చంద్రబాబు ఆది నుంచీ అవమానాలకు గురి చేస్తున్నారు. కొవ్వూరులో బాబు సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు నేతలకు పార్టీ పగ్గాలు అప్పగించారు. దీంతో ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంలో వేరే సామాజిక వర్గ నేతల పెత్తనమేమిటన్న విమర్శలు ఎస్సీల్లో తలెత్తాయి. పేరు ఒకరిది.. పెత్తనం మరొకరిదా? అన్న వాదన సైతం వినిపించింది. కానీ, దీనిని ఏమాత్రం లెక్క చేయని చంద్రబాబు.. నామ్‌కే వాస్తే అన్నట్లుగా జవహర్‌కు టీడీపీ జిల్లా పగ్గాలు అప్పగించారు. కానీ, కొవ్వూరు నియోజకవర్గ పార్టీ వ్యవహారాలకు మాత్రం ఆయనను దూరంగా ఉంచారు. ఆయన స్థానంలో పెండ్యాల అచ్చిబాబుకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో నియోజకవర్గంలో ఆయన ఆధిపత్యమే నడుస్తూ వచ్చింది. పార్టీ శ్రేణులు, అధినాయకత్వం సైతం ఆయన నిర్ణయాలకే జీ హుజూర్ అనే పరిస్థితి తలెత్తింది. ఇటీవల అభ్యర్థుల ఎన్నికకు టీడీపీ చేపట్టిన సర్వేలో సైతం జవహర్ పేరే లేకుండా ఆ వర్గం పావులు కదిపింది. కొవ్వూరు టికెట్టు జవహర్‌కు కాకుండా ఎవరికిచ్చినా పని చేస్తామని బాబు వద్ద పంచాయితీ పెట్టారు. వారి ఒత్తిడికి తలొగ్గిన బాబు చివరకు జవహర్‌ను పక్కన పెట్టారు.

ఇప్పటికే శేషారావుకు శరాఘాతం

ఇప్పటికే టీడీపీ – జనసేన పొత్తుతో నిడదవోలు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత బూరుగుపల్లి శేషారావు సీటు గల్లంతైంది. జనసేన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్‌కు నిడదవోలు కట్టబెట్టారు. ఆయనను వ్యతిరేకిస్తూ శేషారావు వర్గం ఆందోళనలు చేసినా చంద్రబాబు ఖాతరు చేయలేదు. పైగా బుజ్జగించే ప్రయత్నం కూడా చేయలేదు. తాజాగా జవహర్‌కు సైతం అదే అనుభవం ఎదురైంది. దీనినిబట్టి మాజీ ఎమ్మెల్యేలంటే బాబుకు ఎంత చిన్నచూపో అర్థమవుతోందని పార్టీలోని అసంతృప్తివాదులు అంటున్నారు.

మద్దిపాటి నియామకంపై అసంతృప్తి

ఎప్పటి నుంచో అనుకున్నట్లుగానే గోపాలపురం టికెట్టును మద్దిపాటి వెంకట్రాజుకు ప్రకటించారు. ఆయనకు గోపాలపురం కట్టబెట్టాలన్న తలంపుతో మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును ఉన్న పళంగా నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి నుంచి తొలగించారు. దీనిపై అప్పట్లో ఎస్సీ సామాజికవర్గ నేతల్లో ఆగ్రహావేశాలు వెల్లువెత్తాయి. మద్దిపాటి నియామకంపై ఉమ్మడి పశ్చిమ గోదావరి జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు వర్గం కారాలు మిరియాలు నూరుతోంది. అధినేత నిర్ణయంపై భగ్గుమంటోంది.

గోరంట్లకు గ్రీన్ సిగ్నల్

రాజమహేంద్రవరం రూరల్ సీటుపై నెలకొన్న పీటముడి ఎట్టకేలకు వీడిపోయింది. ఈ స్థానం తనదంటే తనదంటూ టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జనసేన నేత కందుల దుర్గేష్ పోటాపోటీగా బహిరంగ ప్రకటనలు చేశారు. ఈ పరిణామం ఒకానొక దశలో తీవ్ర విమర్శలకు దారితీసింది. ఇరువర్గాలూ బహిరంగంగా రొడ్డెక్కాయి. ఇంత జరుగుతున్నా టీడీపీ, జనసేన అధినేతలు పట్టించుకోలేదు. పైగా, పుండుపై కారం చల్లిన చందంగా రూరల్ జనసేనదే అంటూ పవన్ స్వయంగా ప్రకటించడంతో గోరంట్ల, దుర్గేష్ మధ్య వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. తాజాగా దుర్గేష్‌కు నిడదవోలు కేటాయించడంతో బుచ్చయ్యకు రూరల్ లైన్ క్లియరైందని అందరూ భావించారు. అనుకున్నట్టుగానే రెండో జాబితాలో రూరల్ స్థానాన్ని గోరంట్లకే కేటాయిస్తూ ప్రకటించారు. టీడీపీలో చంద్రబాబు కంటే సీనియర్ నేత అయిన బుచ్చయ్య సైతం సీటు దక్కించుకునేందుకు నానా తిప్పలు పడాల్సి వచ్చింది.

నోడల్ అధికారులు సిద్ధంగా ఉండాలి



ఎన్నికల విభాగంలో ఏర్పాటు చేసిన టీవీలను పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కీలక బాధ్యతలు అప్పగించిన నోడల్ అధికారులు శుక్రవారానికి అన్నివిధాలా సిద్ధంగా ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎన్నికల విభాగాలను, మౌలిక సదుపాయాలను జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్‌తో కలిసి గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల కమిషన్ త్వరలోనే సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉందన్నారు. షెడ్యూల్ ప్రకటించిన రోజు నుంచి ఆయా బాధ్యతలు నిర్వర్తించాల్సిన అధికారులు, అనుబంధ సిబ్బంది డ్యూటీ చార్టు సిద్ధం చేసుకుని, నివేదిక అందజేయాలని సూచించారు. నోడల్ అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని, సిబ్బందికి షిఫ్టుల వారీగా విధులు కేటాయించాలని అన్నారు. కలెక్టరేట్‌లోని మీడియా సెంటర్, మెటీరియల్ సెంటర్, కంప్యూటరైజేషన్ సైబర్ అండ్ ఐటీ విభాగం, విజువల్ మానిటరింగ్, ఎంసీసీ, ఎక్స్‌పెండిచర్ కమ్యూనికేషన్ ప్లాన్, కంప్లైంట్ రీడ్రెస్సల్, హెల్ప్‌లైన్, సువిధ, సీ-విజిల్, ఇతర ఎన్నికల విభాగాలను పరిశీలించారు. డీఆర్‌ఓ జి.నరసింహులు, ఏఆర్‌వో ఆర్.కృష్ణనాయక్, ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

- ఒకరి మృతి, మరొకరికి గాయాలు
- గామన్ బ్రిడ్జి వద్ద ఘటన

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు.. కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన ఎ.నాగవాసు (38), తన స్నేహితుడు చంటిబాబుతో కలిసి ఒడిశాకు రొయ్యల లోడు లారీతో బయల్దేరారు. కొవ్వూరు నుంచి రాజానగరం వైపుగా వస్తూ గామన్ వంతెన సమీపాన కాతేరు వద్ద జాతీయ రహదారి పక్కన లారీని నిలిపారు. దానిని వెనుక నుంచి గ్రానైట్ లోడుతో వస్తున్న లారీ బలంగా ఢీకొంది. దీంతో ఆగి ఉన్న లారీ పూర్తిగా బోల్తా పడి, క్యాబిన్ నుజ్జునుజ్జయ్యింది. క్యాబిన్‌లో ఉన్న నాగవాసు అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కనే ఉన్న చంటిబాబు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో నుజ్జయిన లారీ క్యాబిన్

క్రీడాభివృద్ధికి సీఎం జగన్ ప్రాధాన్యం

- దివాన్ చెరువులో రూ.4 కోట్లతో మల్టీ స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియం
- భూమిపూజ చేసిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: రాష్ట్రంలో క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు క్రీడా స్థలాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. దివాన్ చెరువులో రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో రూ.4 కోట్లతో నిర్మించే మల్టీ స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులకు గురువారం ఆయన భూమి పూజ చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, సరైన రీతిలో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇటీవల ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహించిందన్నారు. దివాన్ చెరువులో మల్టీ స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియాన్ని రెండంతస్తులుగా నిర్మిస్తున్నామని తెలిపారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో రెండు షటిల్ కోర్టులు, టేబుల్ టెన్నిస్ కోర్టులు ఉంటాయన్నారు. ఫస్ట్ ఫ్లోర్‌లో క్రీడాకారులకు డార్మెటరీ రూములు ఉంటాయన్నారు. నియోజకవర్గంలోని సీతానగరంలో క్రీడా వికాస కేంద్రం ఏర్పాటు చేశామని చెప్పారు. రానున్న కాలంలో నియోజకవర్గం నుంచి ఎక్కువ మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలనే ఉద్దేశంతో అవసరమైన వసతులు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే రాజా తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, వేమగిరి కృష్ణ, మెట్ల ఏసుపాదం, యర్రంశెట్టి ధర్మరాజు, ఎస్‌పీఎల్, మార్గాని శ్రీను, పలివెల స్వామి, మందాల వెంకటేష్ పాల్గొన్నారు.



మల్టీ స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ఈబీసీ మహిళలకు ఆర్థిక భరోసా

- కలెక్టర్ మాధవీలత
- 16,771 మందికి రూ.25.15 కోట్ల ఈబీసీ నేస్తం నిధుల జమ
- బనగానపల్లిలో బటన్ నొక్కి విడుదల చేసిన సీఎం జగన్
- నమూనా చెక్ అందజేసిన కలెక్టర్

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ద్వారా అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన పేద మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. నంద్యాల జిల్లా బనగానపల్లిలో గురువారం జరిగిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో వైఎస్సార్ ఈబీసీ నేస్తం మూడో విడత నిధులు జమ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమంలో కలెక్టర్ మాధవీలత మాట్లాడారు. ఈబీసీ నేస్తం పథకం కింద జిల్లాలోని 16,771 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.25,15,65,000 లబ్ధి చేకూర్చిందని తెలిపారు. మహిళా లబ్ధిదారుల జీవితాల్లో సరికొత్త కాంతులు నింపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆర్థిక ప్రోత్సాహం అందిస్తోందని చెప్పారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ, వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా 45 నుంచి 60 సంవత్సరాల లోపు వయసు కలిగిన రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమతో పాటు ఇతర అగ్రవర్ణాలకు చెందిన పేద మహిళలకు ప్రభుత్వం ఏటా రూ.15 వేల చొప్పున మూడేళ్లలో రూ.45 వేల వరకూ ఆర్థిక సహాయం అందజేసిందని వివరించారు. తద్వారా వారు సొంత వ్యాపారాలు చేసుకుని తమ కాళ్లపై తాము నిలబడేవిధంగా ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ సహాయ కార్య నిర్వహణాధికారి పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి పీఎస్ రమేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు నమూనా చెక్ అందిస్తున్న కలెక్టర్ మాధవీలత, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు తదితరులు

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారుల వివరాలు

నియోజకవర్గం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.)
అనపర్తి	4,256	6,38,40,000
గోపాలపురం	2,322	3,48,30,000
కొవ్వూరు	2,456	3,68,40,000
నిడదవోలు	2,625	3,93,75,000
రాజమహేంద్రవరం సిటీ	1,519	2,27,85,000
రాజమహేంద్రవరం రూరల్	1,423	2,13,45,000
రాజానగరం	1,945	2,91,75,000
జగ్గంపేట (గోకవరం మండలం)	225	33,75,000

రెండు విడతల్లో రూ.30 వేల సాయం



గత రెండు విడతలుగా నాకు రూ.30 వేల ఆర్థిక సహాయం అందింది. ఉన్నత కులాలకు చెందిన పేద మహిళలకు ఆర్థిక సహాయం అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– సీహెచ్ సత్యవతి, రాజమహేంద్రవరం


కష్టాలను అర్థం చేసుకున్న ప్రభుత్వం



గతంలో ఏ ప్రభుత్వమూ అగ్రవర్ణ పేదల కష్టాల గురించి ఆలోచించలేదు. ప్రతి వర్గంలో పేదలు, ధనికులు ఉంటారని గుర్తించి, వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్న గొప్ప మనిషి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి.

– మాధవీలత, మోరంపూడి

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా మూడు విడతల్లో రూ.45 వేలు అందుకున్నాను. అగ్రవర్ణ పేదలకు ఈబీసీ నేస్తం ద్వారా ఏటా రూ.15 వేల సాయం అందించి, మాకు అన్ని విధాలా అండగా నిలుస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– చుండ్రు నాగలక్ష్మి, ధవళేశ్వరం

క్లుప్తంగా

పంట కాలువలు, లాకుల పరిశీలన



పి.గన్నవరంలో అక్విడెక్టును పరిశీలిస్తున్న రంగస్వామి

పి.గన్నవరం: డెల్టా ఇరిగేషన్ సిస్టంలో పంట కాలువలు, లాకుల నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) మెంబర్ సెక్రటరీ రంగస్వామి అలగేషన్ అన్నారు. రెండు రోజులుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈస్టర్న్, సెంట్రల్, వెస్టర్న్ డెల్టాల పరిధిలోని 10 లాకులను, పంట కాలువలను ఆయన పరిశీలించారు. గురువారం సాయంత్రం పి.గన్నవరంలోని కొత్త, పాత అక్విడెక్టులను, కొత్త అక్విడెక్టు కాలువలో ఫ్లడ్ ప్రొటెక్షన్ గేట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. పలుచోట్ల లాకుల్లో ఇనుప గేట్లు, షట్టర్లు తుప్పు పడుతున్నాయని, కాలువల్లో పూడిక, తూడు పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతున్నదని వివరించారు. గేట్లు, షట్టర్లు తుప్పు పట్టకుండా రిపేరు చేసి పెయింట్లు వేయాలని అన్నారు. తన పరిశీలన నివేదికను జీఆర్ఎంబీ ఉన్నతాధికారులకు పంపుతామని రంగస్వామి తెలిపారు. ఆయన వెంట ఈఈ వెంకట స్వామి, పి.గన్నవరం, నర్సాపురం ఇరిగేషన్ డీఈఈలు వెంకటేశ్వర రావు, సత్యనారాయణ, స్థానిక ఏఈ సుందర్ సింగ్ ఉన్నారు.

ఫిజియో థెరపిస్టు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ముమ్మిడివరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సమగ్ర శిక్ష పరిధిలో ఉన్న మండల భవిత కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఐదు ఫిజియో థెరపిస్టు పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు తెలిపారు. ఫిజియోథెరపిస్టు బీపీటీ, ఎంపీటీ కోర్సులు చేసినవారు ఈ పోస్టులకు అర్హులు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 19వ తేదీలోగా ముమ్మిడివరంలోగల తమ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని ఆయన సూచించారు.

చక్కగా రాస్తే మార్కులు

- టెన్త్ విద్యార్థులకు నిపుణుల సూచనలు
- పరీక్షలకు సిద్ధమవుతున్న 83,491 మంది



రాయవరం: విద్యార్థుల్లో ఇప్పటికే 'టెన్'షన్ మొదలైంది. మరో మూడు రోజుల్లో పరీక్షలు ప్రారంభం కానున్నాయి. తొలిసారిగా పబ్లిక్ పరీక్షలు అనగానే తెలియని ఆందోళన. తెలిసిన సమాధానాలే అయినా వాటిని పేపరుపై ఎలా ప్రజెంట్ చేయాలో తెలియక కొందరు సతమతమవుతారు. తరగతి గదిలో టకీమని జవాబుల చెప్పే కొందరు విద్యార్థులు మార్కుల సాధనలో మాత్రం వెనుకబడి ఉంటారు. బాగా వచ్చిన సమాధానాలను సరైన రీతిలో రాయలేక పోవడమే ఇందుకు కారణం. చిన్న అవరోధాన్ని అధిగమిస్తే విజయం వారి సొంతం. ఈ నెల 18వ తేదీ నుంచి పది పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి 83,491 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో సాధారణంగా చేసే చిన్న చిన్న పొరపాట్లు, వాటిని సరిదిద్దుకోవలసిన తీరు, పరీక్షలు రాయడంలో మెళకువలు, సూచనలు విద్యార్థుల కోసం..

ప్రజెంటేషన్ కీలకం

ఏడాది మొత్తం చదివింది ఒక ఎత్తైతే పరీక్షల్లో ఎలా ప్రజెంట్ చేశామనేదే చాలా కీలకం. సంవత్సరం పాటు చదివిన విషయాలను మూడు గంటల్లో పరీక్ష పత్రంపై ఎలా పెట్టాలన్నదే విద్యార్థులను తొలిచే ప్రశ్న. ఒక్కోసారి సమాధానాలు తెలిసినా విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని సమగ్రంగా రాయలేక పోతారు. అలాకాకుండా జవాబులను సూటిగా రాయాలి. సమాధానాలు టీచరుకు తెలుసని విద్యార్థి గుర్తించాలి. మనం రాసే తీరు పరీక్ష పేపరు వేల్యుయేషన్ చేసే వారిని ఇబ్బంది పెట్టేలా ఉండరాదు. వ్యాకరణ దోషాలు లేకుండా చూసుకోవాలి. చేతిరాత గుండ్రంగా, అర్థమయ్యేలా ఉండాలి.

మార్కుల సాధనలో దస్తూరీ కీలకమే

ఓ విద్యార్థి చేతిరాతను బట్టి సంబంధిత విషయంపై అతని అవగాహన స్థాయిని చెప్పవచ్చు. పరీక్షలు రాసే విద్యార్థులు ఎంత తెలివైన వారనేది జవాబు పత్రాలు మూల్యాంకనం చేసేవారికి తెలియదు. వారు రాసే తీరు, అక్షరాల కూర్పును బట్టే వారి జ్ఞానాన్ని అంచనా వేస్తారు. ఈ విషయంలో చేతి రాతకు ఎంతో ప్రాధాన్యం ఉంది. కళ్లకు ఇంపుగా కన్పించే అక్షరాలు..అందమైన దస్తూరీ చూసే వారిని ఇట్టే ఆకట్టుకుంటాయి. జవాబు పత్రాలు మూల్యాంకనం చేసేవారి మనసుకు హత్తుకుని మార్కులు వేసేలా ప్రేరేపిస్తుంది. పరీక్షలో విజేతగా నిలుపుతుంది.

ఉమ్మడి జిల్లాలో పదవ తరగతి విద్యార్థులు

జిల్లా	బాలురు	బాలికలు	మొత్తం
కాకినాడ	16,121	16,141	32,262
తూర్పుగోదావరి	15,819	14,297	30,116
కోనసీమ	10,871	10,242	21,113

సహజంగా చేసే పొరపాట్లివీ..

కొందరు విద్యార్థులు ఒక జవాబు పత్రంపై 25–30 లైన్లు రాస్తారు. గజిబిజిగా, దగ్గరదగ్గరగా ఉండడంతో జవాబుపత్రం చూడగానే ఆకట్టుకోదు. అందువల్ల ఒక్కో పేజీలో 16–18 లైన్లకు మించకుండా చూడాలి. ఒక పాయింట్ దగ్గర మొదలైన రాత ఆ లైను చివరికి వెళ్లే సరికి పైకో కిందకో పోతుంది. దాంతో ఆ పేజీల్లో అన్ని లైన్లు గజిబిజిగా మారతాయి. లైన్లు సమాంతరంగా ఉండేలా చూడాలి. ప్రశ్న నంబర్లకు జవాబులో ముఖ్యమైన పాయింట్లకు ఇచ్చే సంజ్ఞలు మార్జిన్‌లో ఒక దాని కింద మరొకటి వేయవద్దు. గీత చివరి వరకూ రాస్తూ చివరికి వెళ్లగానే అక్కడ సగం పదం రాసి..మరో సగాన్ని కింద లైనులో రాస్తుంటారు. దీంతో దిద్దే వారికి ఆ పూర్తి పదం ఏంటో అర్థం కాదు. సాధ్యమైనంత వరకు పదాలను ఒక లైనులోనే వచ్చేలా రాయాలి. చాలా మంది విద్యార్థులు బాగా ఒత్తిపట్టి రాస్తుంటారు. కలాన్ని వేళ్లతో బిగుతుగా పట్టుకుంటారు. దీంతో పేజీ రెండో వైపు ఆ అక్షరాలు కన్పిస్తూ చివరికి జవాబు పత్రాలు గజిబిజిగా తయారవుతాయి. పైగా విద్యార్థులకు కూడా రాయడం మొదలు పెట్టిన కొద్ది సేపటికే వేళ్లు నొప్పి పెడతాయి. చాలా మంది విద్యార్థులు అంకెలను సరిగా రాయరు. '2' అంకెను ఇంగ్లిష్ జెడ్ తరహాలో, '5'ను ఎస్‌లా '0'ను 6 తరహాలో రాస్తుంటారు. ఫలితంగా రావలసిన మార్కులు తగ్గిపోతాయి. చాలామంది విద్యార్థులు ఇంగ్లిష్ 'ఐ'పై చుక్క 'జె' అక్షరంపై గీత వేయరు. తెలుగులో ఐ, మ, య, సరిగా రాయరు. పరీక్ష పత్రంలో ఏవైనా తప్పులు రాస్తే వాటిని పెన్సిల్ లేదా పెన్నుతో బాగా రుద్దుతారు. దీంతో పేపరంతా నల్లగా మారుతుంది. స్కెచ్ పెన్సిల్‌ను, పలు రంగుల రీఫిల్స్‌ను అడ్డదిడ్డంగా ఉపయోగిస్తుంటారు. ఇది మంచిది కాదు. అవసరమైన చోటనే ఉపయోగిస్తే అందంగా ఉంటుందని గుర్తించాలి. సైన్స్‌లో బొమ్మల్ని గీస్తే ఆ చిత్రంలోని భాగాల్ని గుర్తించడంలో ఒక క్రమ పద్ధతి పాటించాలి.

ఇలా రాస్తే మంచిది..

ప్రశ్నలను ఒకటికి రెండు సార్లు చదివి అర్థం చేసుకున్నాకే రాయాలి. సమాధాన పత్రంలో పేజీకి 15–16 లైన్లు ఉండాలి. పేజీకి పైన, కింద మార్జిన్ విడిచి పెట్టాలి. మొదటి వరసలో ఎంత బాగా రాశారో చివరి వరకు అదే దస్తూరీని కొనసాగించాలి. వాక్యాలు చక్కగా ఉండేలా చూసుకోవాలి. తెలుగు, ఆంగ్లం, హిందీలోని లెటర్ రైటింగ్‌ను ఒకే పేజీలో వచ్చేలా రాయాలి. అక్షర దోషాలు దిద్దుబాట్లు లేకుండా చూసుకోవాలి. గణితంలో అంకెలు స్పష్టంగా ఉండాలి. కొట్టివేతలు వస్తే మార్కులు తగ్గిస్తారు. ఇచ్చిన సమస్యను అర్థం చేసుకున్న తర్వాతే రాయడం ప్రారంభించాలి. గ్రాఫ్‌ను చక్కగా గీయాలి. సైన్స్‌లో బొమ్మలు గీసేటప్పుడు కష్టమైన వాటిని వదిలేసి సులభంగా ఉన్నవాటిని ఆకర్షణీయంగా గీయాలి. సాంఘిక శాస్త్రం సబ్జెక్టును సమాధానాలను పాయింట్లు వారీగా రాయాలి. మ్యాప్‌లో అడిగిన వాటిని స్పష్టంగా గుర్తించాలి. శీర్షికలు, ఉపశీర్షికల కింద అండర్‌లైన్ చేయాలి. మంచి పెన్నులు ఉపయోగించాలి. బిట్లు రాసేటప్పుడు కొట్టివేతలు రాకుండా చూసుకోవాలి.

మూల్యాంకనపై ప్రభావం



అందమైన దస్తూరి మూల్యాంకనం చేసే వారిని ప్రభావితం చేస్తుంది. చాలా మంది కష్టపడి చదువుతారు కాని బాగా రాయక పోవడంతో అనుకున్న మార్కులు సాధించలేక పోతున్నారు. చదివిన విషయాన్ని పేపరుపై ప్రజెంటేషన్ చేయడం కూడా ప్రధానమైన అంశంగా చెప్పవచ్చు.

– సీహెచ్ పద్మావతి, ప్రధానోపాధ్యాయురాలు(ఎఫ్ఏసీ), జెడ్పీహెచ్ఎస్, ద్రాక్షారామ, రామచంద్రపురం మండలం

మెరుగైన ప్రతిభ కనబర్చాలి



సమాధానాలు రాసే సమయంలో తప్పులు, కొట్టివేతలు లేకుండా చూసుకోవాలి. చక్కగా రాసిన వారికి మంచి మార్కులు వస్తాయి. అలాగని దస్తూరి సరిగ్గా లేనివారు ఆందోళన పడాల్సిన పనిలేదు. సమాధానాలు అర్థమయ్యేలా చూసుకోవాలి. పరీక్షల్లో ఉన్నంతలో మెరుగ్గా రాసే ప్రయత్నం చేస్తే మంచి ఫలితాలు వస్తాయి.

– బీఆర్ కామేశ్వరరావు, హెచ్ఎం, ఎంజీ మున్సిపల్ ఉన్నత పాఠశాల, అమలాపురం

రూ. 9లక్షల విలువైన గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లతో సూపరింటెండెంట్ రవికుమార్, సిబ్బంది

ప్రత్తిపాడు: లారీలో అక్రమంగా తరలుతున్న 176 కేజీల గంజాయిని జాతీయ రహదారిపై ప్రత్తిపాడు వద్ద గురువారం స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ-సెబ్) పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జె.రవికుమార్ స్థానిక సెబ్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. లారీలో గంజాయి తరలుతున్నట్టు జిల్లా అధికారులకు సమాచారం అందడంతో ప్రత్తిపాడు సెబ్ సీఐ ఎల్.చిరంజీవి తన సిబ్బందితో జాతీయ రహదారిపై గస్తీ నిర్వహించారు. తుని నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న లారీని కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్‌గేట్ దాటిన తర్వాత అదుపులోకి తీసుకుని, తనిఖీ చేపట్టారు. లారీ అడుగు భాగంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అరలో 84 గంజాయి ప్యాకెట్లను కనుగొన్నారు. ఈ ప్యాకెట్లలో ఉన్న రూ.9 లక్షల విలువ గల 176 కేజీల గంజాయిని, లారీని స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం పాలకుర్తి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పాడేపల్లి చంద్రయ్యను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ జె.రవికుమార్ తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ పీఎస్ దొర, ప్రత్తిపాడు, కాకినాడ సౌత్ సెబ్ సీఐలు ఎల్.చిరంజీవి, ఆర్.జయరామ్ సతీష్, ఎస్సై ఎం.ఆశాలత పాల్గొన్నారు.

ఐక్యతే శెట్టిబలిజ కులస్తుల బలం

- మంత్రి చెల్లుబోయిన వేణు
- శెట్టిబలిజ సంఘానికి 630 గజాల స్థలం అప్పగింత
- పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారంపూడి, ప్రజాప్రతినిధులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి వేణు. చిత్రంలో ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

కాకినాడ: ఐక్యతే శెట్టిబలిజ కులస్తుల బలమని రాష్ట్ర సమాచార పౌరసంబంధ, బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కాలనీ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిన 630 చదరపు గజాల స్థలాన్ని గురువారం అప్పగించారు. మంత్రి వేణు, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి వేణు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శెట్టిబలిజ సామాజిక వర్గానికి పెద్దపీట వేశారన్నారు. మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలుగా చట్టసభల్లో మరే రాజకీయ పార్టీ కల్పించనంత ప్రాధాన్యాన్ని శెట్టిబలిజలకు ఇచ్చారన్నారు. భావితరాల భవిష్యత్తు కోసం బాబాసాహెబ్ అంబేడ్కర్, పూలే వంటి మహనీయుల స్ఫూర్తితో పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు జగన్ ఎంతో శ్రమించారన్నారు. అటువంటి సీఎంను, కాకినాడలో శెట్టిబలిజ కులస్తులకు అగ్రపీఠం వేసిన ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ కాకినాడలోని శెట్టిబలిజ సామాజిక వర్గంతో తనకు ఎంతో ఆత్మీయబంధం ఉందన్నారు. ఈ వర్గానికి రాజకీయంగాను, ఇతర అంశాల్లోనూ అత్యధిక ప్రాధాన్యం ఇచ్చానన్నారు. ప్రధానంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంత్రి వేణు సహకారంతో స్థలం మంజూరైందని, ఇది తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. శెట్టిబలిజలకు మంత్రి పదవితో పాటు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లను కూడా కేటాయించి వారు అత్యున్నత స్థానంలో ఉండాలని ఆకాంక్షించిన సీఎం జగన్‌ను రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సుమారు రూ.మూడున్నర కోట్ల వ్యయంతో కేటాయించిన స్థలంలో శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని కూడా ఎన్నికల అనంతరం పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే ద్వారంపూడి హామీ ఇచ్చారు. స్థలం మంజూరుకు సహకరించిన మంత్రి చెల్లుబోయిన వేణు, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిలను శెట్టిబలిజ సామాజిక వర్గ ప్రతినిధులు గజమాలతో సత్కరించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్ పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, శెట్టిబలిజ సంఘం ప్రముఖులు గుబ్బల తులసీకుమార్, పితాని శ్రీనివాసరావు, గెద్దాడ వెంకటేశ్వరరావు, రెడ్డి రామపశ్లంరాజు, పితాని నూకరాజు పాల్గొన్నారు.


గీతాంజలి మృతికి కారకులైన దోషుల్ని శిక్షించాలి



పి.గన్నవరంలో జరిగిన కొవ్వొత్తుల ప్రదర్శన

పి.గన్నవరం: తెనాలిలో గీతాంజలి మృతికి కారకులైన దోషుల్ని కఠినంగా శిక్షించాలని పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. గీతాంజలి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ విప్పర్తి ఆధ్వర్యంలో గురువారం రాత్రి స్థానిక మూడు రోడ్ల సెంటర్లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చిందని ఎంతో ఆనందంగా చెప్పిన గీతాంజలిపై ప్రతిపక్ష సోషల్ మీడియా కక్షగట్టి ప్రాణాలను బలిగొందని ఆవేదన వ్యక్తం చేశారు. గీతాంజలిని వేధించి, ఆమె మరణానికి కారణమైన టీడీపీ, జనసేన సోషల్ మీడియా సైకోల ఆగడాలను అరికట్టాలని పార్టీ శ్రేణులు నినాదాలు చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, దాసరి కాశీ, కొక్కిరి రవికుమార్, దొమ్మేటి సూర్య, అడ్డగళ్ల శ్రీను పాల్గొన్నారు.


అపూర్వ సమ్మేళనం



దశాబ్దాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ముమ్మిడివరం: ఒకచోట చదివిన వీరంతా ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. 54 ఏళ్ల తర్వాత వారంతా మళ్లీ ఒక్కచోట చేరి సందడి చేశారు. ముమ్మిడివరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1966–69లో ఎస్ఎస్ఎల్‌సీ వరకు చదివిన పూర్వ విద్యార్థుల గురువారం ఒక్కచోట చేరి సందడి చేశారు. అలనాటి మధుర స్మృతులను నెమరు వేసుకుని, ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అప్పట్లో విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు కోర్ల సుబ్బారావు, పుల్లెల భీమశంకరం, చివుకుల రామం, సీహెచ్ వీకే ఆచార్యులును ఘనంగా సత్కరించారు.

50 ఏళ్ల తర్వాత గ్రామానికి వచ్చిన బేతవోలు



నల్లజర్లలో ఆచార్య బేతవోలు రామబ్రహ్మం దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

నల్లజర్ల: కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, భాషాసమ్మాన్ పురస్కారం, వైఎస్సార్ లైఫ్ అచీవ్ మెంటు అవార్డు గ్రహీత, తెలుగు సాహితీ సమున్నత శిఖరం, రచయిత, అనువాదకులు, అవధాని ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, ఆయన భార్య సర్వలక్ష్మి గురువారం నల్లజర్ల విచ్చేశారు. ఆయన ఇక్కడ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. దాదాపు 50 ఏళ్ల తర్వాత ఆయన ఇక్కడకు వచ్చారు. అలనాటి బాల్య స్మృతులను నెమరవేసుకున్నారు. బాల్యస్నేహితులు నిమ్మలపూడి వీరరాఘవులు, ముళ్ళపూడి వెంకట రత్తయ్య, గంటా కృష్ణ, దుగ్గిన గోపాలం తదితరులను కలుసుకున్నారు. తాను చదువుకున్న పాఠశాల, తిరుగాడిన గుడి, గోపురాలను సందర్శించారు. అల్లాడ రామయ్య కల్యాణ మంటపంలో రామబ్రహ్మం దంపతులను నూతన వస్త్రాలు, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం, అల్లాడ రామకృష్ణ, పాతూరి సత్యనారాయణ, వెల్లంకి రాఘవ, పాకలపాటి రాంబాబు తదితరులున్నారు. ఆయన శిష్యుడు అమర్‌నాథ్, హరిప్రియంక దంపతులను ఆశీర్వదించారు.

శునకాలు తరమడంతో విద్యార్థి మృతి



శివమోహనకృష్ణ (ఫైల్)

యానాం: శునకాల దాడి కారణంగా పాలిటెక్నిక్ విద్యార్థి మృతిచెందిన ఘటన యానాంలో తీవ్ర విషాదాన్ని నింపింది. గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో వంతపాటి శివమోహన కృష్ణ(19) మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం శివమోహనకృష్ణ తండ్రి వంతపాటి శ్రీనివాస్(గాంధీ) స్థానిక ఫైర్‌స్టేషన్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం తెల్లవారు ఝామున ఆయనను జెర్రి కుట్టడంతో కాలు తిమ్మిరిగా ఉందని, తనను ఆసుపత్రికి తీసుకువెళ్లాలని కుమారుడు శివమోహనకృష్ణను కోరాడు. అతను బైక్‌పై తండ్రిని యానాం జీజీహెచ్‌కు తీసుకువెళ్లి ఇంజెక్షన్ చేయించాడు. తండ్రిని వైద్యులు కొంతసేపు ఆసుపత్రిలో ఉండాలని సూచించడంతో అక్కడే ఉంచేశాడు. పరీక్షలు ఉండటంతో చదువుకోవడానికి శివరామకృష్ణ ఒక్కడే బైక్‌పై తిరిగి వస్తుండగా ఫైర్‌స్టేషన్ సమీపంలో ఉన్న కుక్కలు ఒక్కసారి దాడి చేశాయి. వాటినుంచి తప్పించబోయి ఫైర్‌స్టేషన్ గోడను బలంగా ఢీకొనడంతో తలకు తీవ్రమైన గాయమైంది. స్థానికులు యానాం జీజీహెచ్‌కు తీసుకు వచ్చి ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే శివరామకృష్ణ మృతిచెందాడు. మృతుడు శివరామకృష్ణ స్థానిక అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమో ఈసీఈ ఆఖరి సంవత్సరం చదువుతున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుమారుడి మృతదేహాన్ని చూసి తండ్రి శ్రీనివాస్, తల్లి బేబి బోరున విలపించడం కలచివేసింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పట్టాభి, ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు తెలిపారు. మున్సిపాలిటీ అధికారులు విచ్చలవిడిగా తిరుగుతున్న శునకాల నిరోధానికి చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇటువంటి దారుణాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఐఎఫ్ఓ భరణికి అభినందనలు



ఆఫ్రికా ఖండంలోని కిలిమంజారో శిఖరంపై జాతీయ పతకాన్ని ఎగురవేసిన ఐఎఫ్ఓ భరణి



ఐఎఫ్ఓ భరణికి ఘన స్వాగతం తెలుపుతున్న అటవీ శాఖ ఉద్యోగులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా అటవీశాఖ అధికారిణి ఎస్.భరణి ఈ నెల 8వ తేదీన ఆఫ్రికా ఖండంలోని అత్యంత ఎత్తైన శిఖరం కిలిమంజారో శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించి జాతీయ పతకాన్ని ఎగురవేశారు. గురువారం ఆమె జిల్లాకు చేరుకోగా అటవీశాఖ సిబ్బంది ఘన స్వాగతం తెలిపి అభినందనలు అందించారు. ఈ సందర్భంగా భరణి మాట్లాడుతూ కిలిమంజారో శిఖరాన్ని అధిరోహించడం చాల గర్వంగా ఉందన్నారు. దేశ పతకాన్ని శిఖరంపై ఎగుర వేసిన క్షణం జీవితంలో మరచిపోలేనిదన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించగలరు అని అన్నారు. తనకు స్వాగతం తెలిపిన సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.


హాకీ క్రీడాకారులకు అభినందనలు



రాష్ట్ర స్థాయి పోటీలలో విజయం సాధించిన జిల్లా జట్టు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఇటీవల ప్రకాశం జిల్లా మైనంపాడులో జరిగిన రాష్ట్రస్థాయి మహిళా హాకీ పోటీలలో విజయం సాధించిన జిల్లా జట్టును గురువారం హరీష్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ హరీష్ అభినందించారు. గురువారం డీఎస్ఏలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు ఆయన పలు సూచనలు అందించారు. హాకీ కోచ్ రవిరాజు మాట్లాడుతూ జిల్లా నుంచి నలుగురు క్రీడాకారిణులకు జాతీయస్థాయి పోటీలలో అవకాశం రావడం జిల్లాకు గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, డీఎస్ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

వేట్లపాలెం సర్పంచ్ పదవి మూడు నెలల రద్దు



సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఉప సర్పంచ్ శ్రీరామ్

సామర్లకోట: మండల పరిధిలో వేట్లపాలెం సర్పంచ్ చిల్లి వెంకట లక్ష్మి పదవిని మూడు నెలల పాటు రద్దు చేశారు. ఈ మేరకు ఈఓపీఆర్డీ కర్రి హరి కృష్ణ సత్యారెడ్డి గురువారం విలేకరులకు తెలిపారు. ఈ నెల ఏడవ తేదీ నుంచి జూన్ ఆరో వరకు పదవిని రద్దు చేశామన్నారు. ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టరు కృతికాశుక్లా ఉత్తర్వులు ఇచ్చారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉప సర్పంచ్, ఈఓపీఆర్డీలకు చెక్కు పవర్ ఇచ్చారు. ఉప సర్పంచ్ ఇన్‌చార్జి సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించారు.